

చికాగో విమానాశ్రయం వద్ద సీఎం స్టాలిన్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ప్రవాస తమిళులు

చికాగోలో స్టాలిన్‌కు ఘనస్వాగతం

● విదేశీ పెట్టుబడిదారులతో భేటీ

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆరు రోజుల శాన్‌ఫ్రాన్సిస్కో పర్యటన ముగించుకుని చికాగో నగరానికి వెళ్లారు. అక్కడి విమానాశ్రయం వద్ద స్టాలిన్, ఆయన సతీమణికి దుర్గాస్టాలిన్‌కు అపూర్వ స్వాగతం లభించింది. చికాగో నగరంలో నివసిస్తున్న తమిళులు, తమిళ పారిశ్రామికవేత్తలు, సాహితీ సంఘాల ప్రతినిధులు సీఎం దంపతులకు ఘనస్వాగతం పలికారు. ఆ సందర్భంగా ప్రవాస తమిళ యువతులు కొందరుతు సీఎం దంపతులకు తమిళ సంప్రదాయరీతిలో హారతి పలికి స్వాగతించారు. అమెరికా పర్యటనలో ఇప్పటివరకూ రూ.1300 కోట్ల పెట్టుబడులను సేకరించేలా వివిధ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న స్టాలిన్ చికాగో నగరంలోను పెట్టుబడిదారులతో భేటీ అవుతున్నారు. మంగళవారం రాత్రి చికాగో పెట్టుబడిదారుల సదస్సుకు స్టాలిన్, పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, ఇతర అధికారులు హాజరయ్యారు. ఆ సదస్సుకు విచ్చేసిన బహుళజాతి సంస్థలకు చెందిన పారిశ్రామికవేత్తలతో, పెట్టుబడిదారులతో స్టాలిన్ సమావేశమయ్యారు. ఆ సమయంలో వివిధ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నారు. ఈ నెల 13 వరకు చికాగో నగరం, పరిసర ప్రాంతాల్లోనే స్టాలిన్, అధికారులు బసచేయనున్నారు. ఆ తర్వాత అమెరికా పర్యటనను ముగించుకుని ఈ నెల 14న ఆయన చెన్నైకి తిరిగి రానున్నారు.

వేగంగా ఎయిమ్స్ నిర్మాణం

● 2027 ఫిబ్రవరి లోగా పూర్తిచేయాలని లక్ష్యం



నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 3: మదురై ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. 2027 ఫిబ్రవరి లోగా పనులు పూర్తిచేయాలనే లక్ష్యంగా అధికారులు పరుగులు తీస్తున్నారు. రాష్ట్రంలో ఎయిమ్స్ ఆస్పత్రి ఏర్పాటుచేస్తున్నట్లు 2015 ఫిబ్రవరిలో కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అప్పటి ముఖ్యమంత్రి జయలలిత, మదురై జిల్లా తోపూర్‌లో 'ఎయిమ్స్' కోసం స్థలం కేటాయించారు. అనంతరం ఊహించని విధంగా అనారోగ్యానికి గురై జయ మృతిచెందడంతో, ఎయిమ్స్ స్థలాన్ని మార్చాలని, అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వంలోని కొందరు అధికారులు యత్నించారు. అందుకోసం, ఈరోడ్ జిల్లా పెరుందురై, మదురై జిల్లా తోపూర్, పుదుకోట జిల్లా సెంగిపట్టి, చెంగల్పట్టు జిల్లా చెంగల్పట్టు తదితర ప్రాంతాలు పరిశీలించారు. చివరగా సెంగిపట్టిని ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు పంపారు. కానీ, ఎయిమ్స్ ఆస్పత్రికి వచ్చే ప్రజల సౌకర్యార్థం విమానాశ్రయం, రైల్వేస్టేషన్, నాలుగు రోడ్ల రహదారి తదితర సదుపాయాలు ఆస్పత్రి సమీపంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది.

తోపూర్‌లో..

మదురై తోపూర్‌లో అన్ని రకాల రవాణా సదుపాయాలు అందుబాటులో ఉండడంతో ఆ ప్రాంతంలోనే ఎయిమ్స్ నిర్మాణం చేపట్టాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. దీంతో, స్థలం ఎంపిక వ్యవహారానికి సంబంధించి కేంద్రంలోని బీజేపీకి, అన్నాడీఎంకే ప్రభుత్వానికి మధ్య అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి. చివరకు కేంద్ర ప్రభుత్వ పట్టుదలతో 2018 జూన్‌లో మదురైలో ఎయిమ్స్ ఏర్పాటుకు తోపూర్‌లో స్థలం ఖరారైంది. 6 నెలల అనంతరం తోపూర్‌లో ఎయిమ్స్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

2019 జనవరిలో ప్రధాని శంకుస్థాపన...

పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో, 2019 జనవరి 27న మదురై ఎయిమ్స్ ఆస్పత్రికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. జపాన్‌కు చెందిన జైకా సంస్థ రుణం అందించేలా 2021 మార్చిలో ఒప్పందాలు జరిగాయి. రుణ ఒప్పందం పూర్తయి, ఆస్పత్రి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని భావించిన తరుణంలో, రాష్ట్రంలో అధికారమార్పిడి జరిగి డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైంది.



రెండు దశలుగా పనులు...

నిర్మాణపనులపై సంస్థ అధికారులు మాట్లాడుతూ... మదురై ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణం రెండు దశల్లో జరుగుతుందన్నారు. ఫేస్-1లో 13 భవన నిర్మాణాలు ప్రారంభం కాగా, 33 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇందులో మెడికల్ ఎడ్యుకేషన్ బ్లాక్ (అకడమిక్ జోన్), నర్సింగ్ అకడమిక్ బ్లాక్, అడ్మిన్ బ్లాక్, సర్వీస్ బ్లాక్, హాస్పిటల్, ఔట్ పేషంట్ ట్రీట్‌మెంట్ యూనిట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ హాస్టల్, ఎంబీబీఎస్ స్టూడెంట్స్ హాస్టల్, నర్సింగ్ స్టూడెంట్స్ హాస్టల్ ఇలా 16 రకాల మెడికల్ యూనిట్ భవనాలుంటాయన్నారు. ఫేజ్-2లో ఆడిటోరియం, నివాస భవనాలు, డైరెక్టర్ బంగ్లా, షాపింగ్ కాంప్లెక్స్, మార్చురీ, ఆయుష్ మెడికల్ వింగ్ వంటి 16 రకాల భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ భవనాలను 18 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. మే నెలలో నిర్మాణాలు ప్రారంభించామని, 2027 ఫిబ్రవరి 22లోగా పూర్తిచేయాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం 450 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వచ్చే నెల నుంచి కార్మికుల సంఖ్య పెంచనున్నామన్నారు. ఇకపై నిర్మాణపనుల్లో జాప్యం అన్న మాట ప్రస్తావన ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

డీఎంకే-బీజేపీ రాజకీయ వివాదం...

మదురై ఎయిమ్స్ వ్యవహారంలో డీఎంకే-బీజేపీ ప్రభుత్వాల మధ్య రాజకీయ వివాదం తలెత్తడంతో ఎయిమ్స్ నిర్మాణపనులు మళ్లీ గాఢనిద్రలోకి వెళ్లిపోయాయి. డీఎంకేపై రాజకీయంగా ఒత్తిడి తెచ్చేందుకు ఎయిమ్స్ భవనం లేకపోయినా కేంద్రప్రభుత్వం రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో 'ఎయిమ్స్' వైద్య కళాశాల తరగతులు ప్రారంభించింది. అయితే, నిర్మాణపనులు ప్రారంభం కాకపోవడంతో ఈ ప్రాజెక్ట్ వస్తుందా, లేదా అనే సందేహం ప్రజల్లో నెలకొంది. ఈ క్రమంలో ఇటీవల జైకా సంస్థ ఈ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించి టెండర్లు వేయగా, మదురై తోపూర్‌లో ఎయిమ్స్ నిర్మాణపనులు గత మే నెల నుంచి శరవేగంగా జరుగుతున్నాయి.

జాప్యంతో పెరిగిన ప్రాజెక్ట్ అంచనా

ఎయిమ్స్ ఆస్పత్రిలో 870 పడకలు, 38 పడకలతో ఆయుర్వేద చికిత్సా కేంద్రం, విద్యార్థులు, నర్సుల తరగతి గదులు, ప్రయోగశాలలు, 2,160 కార్లు, 2,090 ద్విచక్రవాహనాల పార్కింగ్ తదితర సదుపాయాలుంటాయి. తొలుత ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన సమయంలో మదురై ఆస్పత్రి ప్రాజెక్ట్ అంచనా రూ.1,264 కోట్లు కాగా, అనంతరం రూ.1,624 కోట్లకు పెంచారు. జైకా నిధులు మంజూరులో జాప్యం జరగడంతో నిర్మాణపనులు ఆలస్యమై ప్రాజెక్ట్ అంచనా రూ.1,977.80 కోట్లకు పెంచారు. ప్రస్తుతం ఈ అంచనా రూ.2,021.51 కోట్లకు పెరిగింది.

చెన్నై రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్‌గా విజయకుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి ఎస్.విజయకుమార్

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత విదేశీ సేవల (ఐఎఫ్ఎస్) అధికారిగా ఉన్న ఎస్.విజయకుమార్ చెన్నై ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. చెన్నై ప్రాంతీయ 32వ పాస్‌పోర్ట్ అధికారిగా పదవీ స్వీకారం చేసిన ఆయన ఆ కార్యాలయం ఉన్నతాధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇంతకు ముందు ఆయన రోమ్, కాబూల్, దోహాలోని భారతీయ రాయబార కార్యాలయాల్లో పనిచేశారు. విజయకుమార్ గిండి ఇంజనీరింగ్ కాలేజీలో బీఈ (ఎలక్ట్రానిక్స్, టెలీకమ్యూనికేషన్స్) పట్టా పొందారు.

టాస్మాక్ దుకాణాలకు 12 వేల బిల్లింగ్ మెషిన్లు

● వెల్లడించిన మంత్రి ముత్తుసామి



చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టాస్మాక్ మద్యం దుకాణాలలో సిబ్బంది అధిక ధరలకు మద్యం విక్రయించకుండా త్వరలో బిల్లింగ్ మెషిన్లను ఉపయోగించనున్నామని, ఇప్పటికే 12 వేల బిల్లింగ్ యంత్రాలను టాస్మాక్ దుకాణాలకు పంపించినట్లు రాష్ట్ర గృహ, ఎక్సైజ్‌శాఖ మంత్రి ఎస్ ముత్తుసామి తెలిపారు. ఈరోడ్‌లో మంగళవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫార్ములా -4 కార్ల రేసు నిర్వహించడం పట్ల చెన్నై నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఆసియా ఖండంలో ఎక్కడా ఇంత భారీ ఏర్పాట్ల నడుమ ఈ పోటీలు జరుగలేదని చెప్పారు. సీఎస్సీ కళాశాల ప్రభుత్వ కళాశాలగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. టాస్మాక్ దుకాణాలలో అమ్మకాలను అధికం చేయాలని నిర్ణయించడం వల్లే సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదని, మద్యం అమ్మకాల వల్ల ప్రభుత్వానికి రాబడి వస్తుంది కనుకే మద్యం అమ్మకాలు గురించి ఎలాంటి దాపరికాలు లేకుండా వాస్తవాలనే ప్రకటిస్తున్నామని చెప్పారు. మద్యాన్ని అధిక ధరలకు విక్రయించరాదని టాస్మాక్ సిబ్బందికి పలుమార్లు హెచ్చరించామని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మద్యం దుకాణాలకు 12 వేల బిల్లింగ్ మిషన్లను పంపిణీ చేశామని ఆయన వివరించారు. మద్యం దుకాణాలకు 200 మీటర్ల దూరంలో మద్యం తాగివెళుతున్నవారిపై పోలీసులు కేసు నమోదు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయమై తగు చర్యలు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు. ఈరోడ్ నివాసయోగ్యం కాని నగరంగా భావించకూడదని, కొన్ని కర్మాగారాల నుంచి వచ్చే వ్యర్థాల వల్ల క్యాన్సర్ సోకుతోందని స్థానికులు తనకు ఫిర్యాదు చేశారని, ఈ విషయమై త్వరలో చర్యలు తీసుకుంటానని చెప్పారు.

త్వరలో తమిళం మాట్లాడతా

● రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి



సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తన ఎదుట ఎవరైనా తమిళంలో మాట్లాడితే సులువుగా అర్థమవుతోందని, త్వరలో ఆ భాష నేర్చుకుని సునాయాసంగా మాట్లాడుతానని గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. తమిళనాడు హిందీ సాహిత్య అకాడమీ, డీజీ వైష్ణవ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళం అత్యంత ప్రాచీనమైన భాష అని, తమిళ ప్రజల్లాగే తాను ఆ భాషను సునాయాసంగా మాట్లాడాలని ఆశపడుతున్నానని, ఏదో ఒక రోజు తమిళంలో మాట్లాడతాననే నమ్మకం తనకుందన్నారు. తమిళభాషను ప్రపంచ దేశాలకు వ్యాపింపజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలలోనూ తమిళం పాఠ్యాంశంగా చేర్చాలని, ఈ విషయమై గౌహతి విశ్వవిద్యాలయ నిర్వాహకులతో చర్చలు జరుపుతున్నానని చెప్పారు. గత మూడేళ్లుగా తాను తమిళ భాష నేర్చుకుంటున్నానని, ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నానని సభికుల హర్షధ్వానాల మధ్య గవర్నర్ ప్రకటించారు. తమిళ వార్తా పత్రికలను కష్టపడి చదువుతున్నానని చెప్పారు. ఇక భారత దేశం ప్రస్తుతం ప్రగతి పథంలో పయనిస్తోందని, పదేళ్ల క్రితం మన దేశం గురించి ఏ దేశమూ పెద్దగా పట్టించుకోలేదని, ప్రస్తుతం అగ్రరాజ్యాలన్నీ మనవైపే చూస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ ప్రధాని అయ్యాక దేశమంతటా స్టార్ట్ అప్ కంపెనీల సంఖ్య విపరీతంగా పెరిగిందని తెలిపారు. వృక్షాలను, జంతువులను మొక్కుతుంటామని, వసుధైక కుటుంబాన్నే కోరుకుంటున్నామని ఆయన చెప్పారు. విద్యార్థులు దేశాన్ని అభివృద్ధిపరిచే దిశగా కోర్సులను ఎంపిక చేసుకుని చదివితే ఉత్తమ పౌరులుగా రాణించగలుగుతారన్నారు. ఈ సదస్సులో తమిళనాడు హిందీ సాహిత్య అకాడమీ కార్యదర్శి జవహర్ కారూన్, మాజీ వైస్ ఛాన్సలర్ నిర్మలా మౌర్య, వైష్ణవ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌బాబు, కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





అధికారుల సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఈవీ వేలు, పీకే శేఖర్‌బాబు

తిరువణ్ణామలైలో రూ.50 కోట్లతో వసతి గృహాలు

● రూ.23 కోట్లతో గిరిప్రదక్షిణ భక్తులకు వసతులు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలైలో భక్తుల కోసం రూ.50 కోట్లతో వసతి గృహాలు నిర్మించనున్నట్లు రాష్ట్ర మంత్రులు ఈవీ వేలు, పీకే శేఖర్‌బాబు సంయుక్తంగా ప్రకటించారు. తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణకు దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు రూ.23 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. తిరువణ్ణామలైలో భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రజాపనుల శాఖ, దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సమావేశం నగరంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఇద్దరు మంత్రులు గిరి ప్రదక్షిణ మార్గంలో 15 చోట్ల మరుగుదొడ్లు, స్నానపు గదులు, రెండు చోట్ల భక్తులు సేదతీరే కేంద్రాలు నిర్మించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మంత్రి ఈవీ వేలు మాట్లాడుతూ తిరువణ్ణామలై క్షేత్రానికి ఇటీవలి కాలంలో గిరిప్రదిక్షణకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తున్నారని, వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ తమకు ఆదేశించారని చెప్పారు. గిరిప్రదక్షిణ మార్గంలో నిర్మించనున్న మరుగుదొడ్లు, స్నానపు గదులు సుమారు 13 అడుగుల ఎత్తులో ఉంటాయని తెలిపారు. ఇక భక్తుల కోసం నిర్మించే వసతి గృహాల్లో గాలి, వెలుతురు ఇతర సదుపాయాలుంటాయని, ప్రతి వసతి గృహం వద్ద వాటర్ ఫౌంటైన్ కూడా ఏర్పాటు చేస్తామని, ఈ వసతిగృహాల పథకానికి సంబంధించి ప్రాజెక్టు నివేదిక తయారు చేసి ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, అదనపు కమిషనర్లు సుకుమార్, హరిప్రియా, చీఫ్ ఇంజనీర్ పెరియసామి తదితరులు పాల్గొన్నారు.

కల్లు విక్రయాలకు అనుమతివ్వాలి

● వ్యాపార సంఘాల సమాఖ్య డిమాండ్



కల్లు అనుమతించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నాలో మాజీ మంత్రి బెంజిమెన్, ఎన్నార్ ధనపాలన్ తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 3: రాష్ట్రంలో కల్లు అనుమతించాలని వ్యాపారుల సంఘాల సమాఖ్య రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టం సమీపంలో పెరుంతలైవర్ మక్కల్ కట్చి, వ్యాపార సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో కల్లు గీత కార్మికులు, రైతులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అన్నాడీఎంకే నేత మాజీ మంత్రి పి.బెంజిమెన్ ధర్నా ప్రారంభించి మాట్లాడుతూ... పారంపర్య వ్యవసాయ వృత్తిగా భావిస్తున్న తాటి పరిశ్రమను ప్రోత్సహించే విధంగా అన్నాడీఎంకే ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. గీత కార్మికుల ఐదు న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలంటూ రాష్ట్రంలో పలు రైతు సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారని, అయితే దీనిపై రాష్ట్రప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో కల్లు విక్రయాలకు ఆయా రాష్ట్రప్రభుత్వాలు అనుమతిస్తున్నాయని, అయితే లక్షలాది కుటుంబాలున్న గీత కార్మికుల కోర్కెలు మాత్రం ఏళ్ల గడుస్తున్నా నెరవేరలేదన్నారు. తాటిచెట్లు, టెంకాయ చెట్లు ఎక్కే సమయంలో ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు తలా రూ.10 లక్షల ఆర్థికసాయంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి అర్హతను బట్టి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కల్లు విక్రయాలను ప్రభుత్వం అనుమతించాలని, మళ్లీ రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని తప్పకుండా అమలుపరుస్తామని బెంజిమెన్ హామీ ఇచ్చారు. పెరుంతలైవర్ మక్కల్ కట్చి అధ్యక్షుడు ఎన్నార్ ధనపాలన్ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించారని, సంప్రదాయ చిరుధాన్యాల ఆహారానికి అలవాటు పడుతున్నారని అందువల్ల, అధిక శాతం ఆల్కహాల్ లేని కల్లును ప్రభుత్వం అనుమతించి లక్షలాది మంది గీత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆలిండియా నాడార్ మహాజన సభ అధ్యక్షుడు కార్తికేయన్, పెరంబూర్ నాడార్ సంఘం అధ్యక్షులు పద్మనాభన్, మైలై చంద్రశేఖర్, రాజేశ్వరి ప్రియ, క్షత్రియ నాడార్ సమాఖ్య అధ్యక్షుడు చంద్రన్ జయపాల్, సినీ స్టంట్ మాస్టర్ జాగ్వార్ తంగం తదితరులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

మాజీ క్రీడాకారులకు పింఛను

ఐసిఎఫ్, సెప్టెంబరు 3: పింఛన్ పొందేందుకు చెన్నై జిల్లాకు చెందిన మాజీ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించి, ప్రస్తుతం ఆర్థికంగా వెనుకబడిన మాజీ క్రీడాకారులకు ప్రభుత్వం నెలకు రూ.6,000 పింఛన్ అందజేస్తోంది. అర్హులైన వారు ఈ నెల 30వ తేది సాయంత్రం 6 గంటల్లోపు www.sdat.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వయోపరిమితి ఈ సంవత్సరం ఆగస్టు 31వ తేదీతో 58 ఏళ్ల పూర్తయిన వారై ఉండాలి.

రాష్ట్రంలో మరో మూడు జలవిద్యుత్ కేంద్రాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 3: తిరువణ్ణామలై, సేలం, తిరుపత్తూర్‌లో మూడు జలవిద్యుత్ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందాలు రాష్ట్రప్రభుత్వం, గ్రీన్‌కో సంస్థల మధ్య జరిగాయి. ఈ జిల్లాల్లో 3,300 మెగావాట్ల సామర్థ్యంతో ఈ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. అదే సమయంలో ఒకసారి విద్యుదుత్పత్తికి వినియోగించిన నీటిని రీ సైక్లింగ్ చేసి డ్యాంకే తరలించేలా చర్యలు చేపట్టారు. ఆ నీటిని వర్షాలు లేని సమయంలో వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఆహ్వానం

ఐసిఎఫ్, సెప్టెంబరు 3: హయగ్రీవర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాలుర రాష్ట్రస్థాయి చెస్ పోటీలు వండలూరులోని క్రిసెంట్ పాఠశాలలో ఈ నెల 8వ తేది జరుగనున్నాయి. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 7200101544, 7305935093 అనే నెంబర్లు ఈ నెల 6వ తేదిలోపు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 3: నగరంలో వంద మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు థాడ్కో ఆధ్వర్యంలో యూపీఎస్సీ పరీక్షకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ పరీక్ష రాయనున్న అర్హులైన 100 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఏడాది శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ ఖర్చు థాడ్కో భరించడంతో పాటు ఉచితంగా హాస్టల్ సదుపాయం కల్పించనుంది. ఆసక్తి ఉన్నవారు థాడ్కో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందస్వామి తెలిపారు.

హరిత పాఠశాలల కోసం రూ.5.20 కోట్లు

పెరంబూర్, ఆగస్టు 3: రాష్ట్రంలో తొలివిడతగా 26 ప్రభుత్వ పాఠశాలలను హరిత పాఠశాలలుగా మార్చేందుకు రూ.5.20 కోట్లు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం జీవో విడుదల చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.20 లక్షల చొప్పున కేటాయించిన నిధులతో, పాఠశాల విద్యుత్ అవసరాలకు సౌరశక్తి విద్యుదుత్పత్తి చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటనలో తెలిపింది.

క్లాసులకు రాకుండా పరీక్షలు రాస్తే చర్యలు

పెరంబూర్, సెప్టెంబరు 3: విద్యార్థులు తరగతులకు రాకుండా పరీక్షలు రాయించే బీఎడ్ కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని ఉపాధ్యాయ విద్య విశ్వవిద్యాలయం హెచ్చరించింది. రాబోయే రోజుల్లో అన్ని బీఎడ్ కళాశాలలను అధికారులు స్వయంగా తనిఖీ చేస్తారని వర్సిటీ తెలిపింది. పొరుగు రాష్ట్రాల్లోని కేంద్రాల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు తరగతులకు రాకుండానే పరీక్షలకు హాజరవుతున్నారనే ఫిర్యాదులతో ఈ చర్యలు చేపట్టినట్లు వర్సిటీ తెలియజేసింది.

నాగపట్టణం-శ్రీలంక నౌకా ప్రయాణానికి ఆదరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 3: నాగపట్టణం-శ్రీలంక నౌకా ప్రయాణికుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ఈ నౌక సేవలు గత ఏడాది అక్టోబరులో ప్రారంభమై అదే నెల 23వ తేది నిలిచిపోయాయి. అనంతరం మళ్లీ ఈ ఏడాది ఆగస్టు 11వ తేది 'శివగంగ' పేరుతో పునఃప్రారంభమయ్యాయి. మొదటి రోజు 44 మంది ప్రయాణించారు. క్రమేణా తగ్గుతూ వచ్చిన ప్రయాణికుల సంఖ్యతో వారానికి మూడు రోజులు మాత్రమే రవాణా సేవలు నిర్వహించనున్నట్లు నౌకా సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్య క్రమేణా పెరిగింది. ఆదివారం 69మందితో నాగపట్టణం నుంచి శ్రీలంకకు నౌక బయల్దేరింది. రాబోయే రోజుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.59 లక్షల అద్దె బకాయిలుంచిన దేవాదాయ శాఖ

ఐసిఎఫ్, సెప్టెంబరు 3: దేవాదాయ శాఖ రూ.59 లక్షల అద్దె బకాయిలు ఉంచింది. మదురై మీనాక్షి అమ్మవారి ఆలయానికి చెందిన స్థలంలో ఈ శాఖ మండల కార్యాలయం నిర్మించింది. 2017లో అద్దె ఒప్పందం మేరకు ఏర్పాటైన ఈ కార్యాలయానికి రూ.59 లక్షలు దేవాదాయ శాఖ చెల్లించాల్సి ఉందని సమాచార హక్కు చట్టం ద్వారా తెలిసింది.

ఎగ్మూర్-విశాఖ ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 3: విజయదశమి, దీపావళి పండుగల సందర్భంగా చెన్నై ఎగ్మూర్-విశాఖపట్నం, విశాఖపట్నం-కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.08557 విశాఖపట్నం-చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక రైలు ఈ నెల 7,14,21,28, అక్టోబరు 5,12,19,26, నవంబరు 2,9,16,23 (శనివారం) తేదీల్లో విశాఖ లో రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది.
- నెం.08558 చెన్నై ఎగ్మూర్-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈనెల 8,15,22,29, అక్టోబరు 6,13,20,27, నవంబరు 3,10,17,24, డిసెంబరు 1 (ఆదివారం) తేదీల్లో చెన్నై ఎగ్మూర్‌లో ఉదయం 10.30 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.35 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- నెం.08539 విశాఖపట్నం-కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 11,18,25, అక్టోబరు 2,9,16,23,30, నవంబరు 6,13,20,27 (బుధవారం) తేదీల్లో విశాఖపట్నం నుంచి ఉదయం 8.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లం చేరుకుంటుంది.
- నెం.08540 కొల్లం-విశాఖపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 12,19,26, అక్టోబరు 3,10,17,24,31, నవంబరు 7,14,21,28 (గురువారం) తేదీల్లో కొల్లంలో సాయంత్రం 6.35 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. కొల్లం-విశాఖపట్నం-కొల్లం పత్యేక రైళ్లు గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట మీదుగా వెళ్లనున్నాయి.

నగరంలో 1.20 లక్షల వీధిశునకాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 3: నగరంలో వీధి శునకాల గణన సర్వేలో 1.20 లక్షల శునకాలున్నట్లు తెలిసింది.పెంపుడు, వీధి శునకాల దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడగా, కొందరు మృతిచెందారు. పెంపుడు శునకాలకు తప్పనిసరిగా లైసెన్స్ పొందాల్సి ఉంది. వీధి శునకాల గణన చేపట్టేందుకు కార్పొరేషన్ నిర్ణయించింది. ఐదేళ్ల అనంతరం జూలై 10వ తేది ప్రారంభమైన గణన ఆగస్టు 30వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, 1.20 లక్షల శునకాలున్నాయని అధికారులు తెలిపారు.

బిల్డర్ల పాట్లు.....

అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్స్ కొనేవారేరి ?

● 53 శాతం పడిపోయిన విక్రయాలు



పెరంబూర్, సెప్టెంబరు 3: నగరంలో గత ఏడాది రెండవ త్రైమాసికంతో పోల్చితే, ఈ ఏడాది అపార్ట్‌మెంట్లలో విక్రయాలు శాతం తగ్గాయి. అదే సమయంలో కొత్తగా అపార్ట్‌మెంట్లు, ఇంటి నిర్మాణాల సంఖ్య కూడా తగ్గిందని ఇండియ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ సమాఖ్య (సీఆర్‌ఈటీఏఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమాఖ్య నివేదిక ప్రకారం, గత ఏడాది రెండో త్రైమాసికంలో 98 కొత్త అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టేందుకు నమోదుచేసుకున్న నేపథ్యంలో, ప్రస్తుత ఏడాది మొదటి త్రైమాసికంలో కేవలం 65 కొత్త ప్రాజెక్ట్‌లు మాత్రమే నమోదయ్యాయి. ఆ ప్రకారం, నమోదు సంఖ్య 34 శాతం తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే, గత ఏడాది రెండో త్రైమాసికంలో 123 ప్రాజెక్ట్‌ల ప్రారంభానికి నమోదు చేసుకున్న నేపథ్యంలో, ఈ ఏడాది 91 ప్రాజెక్టులు మాత్రమే నమోదయ్యాయి. అదే సమయంలో, కొత్తగా నమోదుచేసిన అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు గత ఏడాదితో పోల్చితే రాష్ట్రంలో 30 శాతం, నగరంలో 37 శాతం పెరిగాయి. గత ఏడాది రెండవ త్రైమాసికంలో రాష్ట్రంలో 7,997 గృహ సముదాయాలు, నగరంలో 6,435 గృహ సముదాయాల రిజిస్ట్రేషన్ జరిగింది. కానీ ఈ ఏడాది 10,333, 8,793 గృహాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. నగరంలో గత ఏడాది 5,498 గృహ సముదాయాలు విక్రయం జరిగిన నేపథ్యంలో, ఈ ఏడాది 2,597 గృహాలు మాత్రమే విక్రయం కావడంతో 53 శాతం తగ్గింది. రియల్ ఎస్టేట్ రంగంలో ఏర్పడిన మార్పులపై సీఆర్‌ఈటీఏఐ సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ అలి మాట్లాడుతూ... గృహాల రిజిస్ట్రేషన్లు పెరిగినా, కొత్త ప్రాజెక్ట్ నిర్మాణాలు తగ్గాయన్నారు. గృహాల విక్రయాలు గత ఏడాదితో పోల్చితే పెరిగినా, ఈ రంగంపై ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని ఆయన తెలిపారు.

జస్టిస్ చంద్రూ నివేదిక తర్వాతే బొట్టుపెడుతున్నా

● హైకోర్టు జడ్జి సుబ్రమణియన్



ముఖ్యమంత్రి స్టాలిన్‌కు నివేదిక అందజేస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రూ (ఫైల్‌ఫొటో) - ఇన్‌సెట్‌లో హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ జడ్జి సుబ్రమణియన్

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల నడుమ కుల ఘర్షణలు నిరోధించే దిశగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రూ కమిటీ చేసిన సిఫార్సులను తాను విభేదిన్నానని, వాస్తవానికి ఆ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాతే నుదుట బొట్టుపెడుతున్నానని హైకోర్టు న్యాయమూర్తి సుబ్రమణియన్ విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో శాశ్వత ప్రాతిపదికన డీన్లను నియమించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ మదురైకి చెందిన వెర్నికా మేరీ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో ఓ పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం మదురై, తిరుచ్చి, విరుదునగర్ వైద్యకళాశాలల్లో వెంటనే డీన్‌లను నియమించాలంటూ రాష్ట్ర ఆరోగ్యశాఖను ఆదేశించింది. ఈ కేసు విచారణ సమయంలో డీన్‌లను త్వరితగతిన ప్రభుత్వం ఎందుకు నియమించలేకపోయిందో కారణాలు తెలుపుతూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసు విచారణ సందర్భంగా పాఠశాలల్లో కులఘర్షణలు నిరోధించేందుకు రిటైర్డ్ జడ్జి చంద్రూ కమిటీ నివేదికపై న్యాయమూర్తి సుబ్రమణియన్ తీవ్ర విమర్శలు చేశారు. పాఠశాలల్లో కుల ఘర్షణలను నిరోధించేందుకు విశ్రాంత న్యాయమూర్తి నాయకత్వంలో ఏర్పాటైన కమిటీ చేసిన సిఫారసులు ఆమోదించదగినవి కావన్నదే తన అభిమతమన్నారు. కుల వ్యత్యాసాలు, కులభావనలు నిర్మూలించడానికి అందరి మధ్య సహనగుణం అధికం కావాలని, విశ్రాంత న్యాయమూర్తి నివేదిక సమర్పించిన తర్వాతే తాను నుదుట బొట్టుపెట్టుకుంటున్నానన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల చేతులకు కుల, మతాలను తెలిపే కంకణాలు (వివిధ రంగుల్లో దారాలు) ధరించకుండా, నుదుట తిలకం, బొట్టు పెట్టుకోకుండా నిరోధక చర్యలు చేపట్టాలని జస్టిస్ చంద్రూ కమిటీ తన నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే.

బండి కాదు మొండి..సాయం పట్టండి...!



సిటీ బస్సును తోస్తున్న ప్రయాణికులు

పెరంబూర్, సెప్టెంబరు 3: నాగపట్టణం జిల్లా ఒరత్తూర్ గ్రామంలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి ప్రతి రోజు వందలాది మంది రోగులు వస్తుంటారు. రోగులు, ప్రజల సౌకర్యార్థం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రభుత్వ, ప్రైవేటు సిటీ బస్సులు నడుపుతుంటారు. ఈ బస్సులు కూడా సకాలంలో రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సోమవారం రాత్రి చాలాసేపు బస్సులు లేక ప్రజలు వేచి ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వ సిటీ బస్సు వచ్చింది. బస్సు ప్రయాణికులతో కిటకిటలాడగా, బస్సు స్టార్ట్ చేసేందుకు యత్నించగా ఇంజన్‌లో లోపం తలెత్తింది. దీంతో, బస్సు కండక్టర్, చుట్టుపక్కల ఉన్న బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, ప్రజలతో కలసి బస్సును కొంత దూరం నెట్టగా, బస్సు స్టార్ట్ అయి బయల్దేరి వెళ్లింది. కండిషన్‌లో ఉన్న బస్సులు నడిపేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుచ్చి ఎన్‌ఐటీలో ఉన్నత స్థాయి కమిటీ విచారణ

అడయార్, సెప్టెంబరు 3: తిరుచ్చిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటి)లోని విద్యార్థినులపై భవిష్యత్‌లో ఎలాంటి లైంగిక వేధింపులు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, సూచనల కోసం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ తన విచారణను ప్రారంభించింది. గత నెల 29వ తేదీ ఓ విద్యార్థిని లైంగికంగా వేధించిన కాంట్రాక్టు ఉద్యోగి కదిరేశన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తమకు జరుగుతున్న లైంగిక వేధింపులపై హాస్టల్ వార్డెన్ల దృష్టికి తీసుకెళ్ళినా వారు ఏమాత్రం స్పందించక పోవడంతో విద్యార్థులంతా కలిసి ఆందోళనకు దిగారు. ఇవి ఉధృతం కావడంతో జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. దీంతో వార్డెన్లు క్షమాపణ చెప్పడంతో వారు ఆందోళనను విరమించారు. ఈ క్రమంలో భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తంకాకుండా ఉండేందుకు ఎన్‌ఐటీ ప్రిన్సిపాల్ కార్వేంబు అధ్యక్షతన తొమ్మిది సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయగా, ఈ కమిటీ తన విచారణ ప్రారంభించింది.

నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా ధర్నా



ధర్నాలో వివిధ పార్టీల నేతలు

వేలూరు, సెప్టెంబరు 3: నూతన విద్యా విధానాన్ని నిరసిస్తూ ఎండీఎంకే ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక సత్తువాచేరి కలెక్టర్ కార్యాలయం సమీపంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా సెక్రటరీ మణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎండీఎంకే జిల్లా అధ్యక్షుడు కుమార్, డీఎంకే యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సాధిక్, సీపీఎం జిల్లా కమిటీ అధ్యక్షుడు ఏలుమలై సహా పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ భూముల కొనుగోలుకు రూ.5 లక్షల సబ్సిడీ

ఐసిఎఫ్, సెప్టెంబరు 3: వ్యవసాయ భూములు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ మహిళలకు రూ.5 లక్షలు అందజేయనుంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తమిళనాడు ఆదిద్రావిడ గృహవసతి, అభివృద్ధి సంస్థ (థాడ్కో) ఆధ్వర్యంలో వ్యవసాయ భూములకు మార్కెట్ విలువలో 50 శాతం (గరిష్టంగా రూ.5 లక్షలు) సబ్సిడీ ఇస్తున్నారు. గరిష్టంగా 2.5 ఎకరాల మాగాణి, 5 ఎకరాల మెట్టు భూములు కొనుగోలు చేసేందుకు అనుమతించారు. ఈ పథకంలో లబ్దిపొందేందుకు ఆసక్తి ఉన్న 18 నుంచి 55 ఏళ్లలోపున్న మహిళలు అర్హులు. కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షల లోపుండాలి. దరఖాస్తుదారులకు సొంతంగా వ్యవసాయ భూములుండరాదు. దరఖాస్తుదారుల పేరు, కుటుంబ సభ్యుల పేర్లతో భూములు కొనుగోలు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు థాడ్కో వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

శబ్ద కాలుష్యంపై అధ్యయానికి రూ.50 లక్షలు

పెరంబూర్, సెప్టెంబరు 3: నగరంలో శబ్ద కాలుష్యంపై అధ్యయనం చేసేందుకు రూ.50 లక్షలు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, కార్పొరేషన్ పరిధిలోని 15 మండలాల్లో తలా నాలుగు సెన్సార్లు అమర్చి శబ్ధకాలుష్యంపై అధ్యయం చేయనున్నారు. నివాస ప్రాంతాలు, ట్రాఫిక్ జంక్షన్లు, విద్యాసంస్థలు వంటి ప్రాంతాల్లో ఈ సెన్సార్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

వావూసీ హార్బర్ సందర్శనకు అనుమతి

పెరంబూర్, సెప్టెంబరు 3: తూత్తుకుడిలోని వావూసీ హార్బర్‌ను ఈ నెల 5వ తేది ప్రజలు సందర్శించవచ్చు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటలకు ప్రజలు ఈ హార్బర్ సందర్శించవచ్చు. వావూసీ 153వ జయంతి సందర్భంగా ప్రజలకు ఈ అవకాశం కల్పించినట్లు హార్బర్ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల, ఆరోగ్యకేంద్రాల తనిఖీ



అధిక మార్కులు సాధించిన విద్యార్థికి పుస్తకం అందించి అభినందిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 3: కేవీ కుప్పం పంచాయతి యూనియన్ పరిధిలోని లత్తేరి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం విధానాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన వసతులు, బోధనా విధానం తదితరాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో సమస్యలను కలెక్టర్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లస్ టూ తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్, పబ్లిక్ పరీక్షలను భయం లేకుండా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని విద్యార్థులకు సూచించారు. లత్తేరి ప్రాథమిక ఆరోగ్య కేందంలో ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఆస్పత్రిలోని మందులు అందించే గదిని పరిశీలించిన కలెక్టర్, అవసరమైన మందులు స్టాకు ఉండేలా చూసుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు.

కోల్‌కత్తా ఘటనలో నిందితులను అరెస్ట్ చేయాలి



ఆందోళనలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

వేలూరు, సెప్టెంబరు 3: కోల్‌కత్తాలో డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను సత్వరం అరెస్ట్ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. కలెక్టర్ కార్యాలయం ఎదుటు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మృతిచెందిన వైద్యురాలికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జోషి అధ్యక్షత వహించగా, కార్యదర్శి వేలు ప్రసంగించారు. కార్యక్రమంలో తమిళనాడు పింఛనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జాక్టో-జియో రాష్ట్ర ఉన్నత స్థాయి కమిటీ సభ్యుడు జనార్థనన్, జిల్లా ఉపాధ్యక్షుడు దీనదయాళన్, రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా సెక్రటరీ రమేష్, తమిళనాడు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్నేహలత, తమిళనాడు వైద్య సంఘం రాష్ట్ర సెక్రటరీ వేందన్, నర్సుల సంఘం రాష్ట్ర సెక్రటరీ హేమచంద్రన్ సహా 200 మందికి పైగా పాల్గొన్నారు.

మహిళా డీఎస్పీపై దాడి

● నలుగురి అరెస్టు




మహిళా డీఎస్పీ గాయత్రిని అడ్డుకుంటున్న ఆందోళనకారులు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా అరుప్పుకోట వద్ద రాస్తారోకోను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళా డీఎస్పీని ఆందోళనకారులు జుట్టుపట్టుకుని లాగి దాడి చేసిన ఘటన కలకలం సృష్టించింది. రామనాథపురం జిల్లా పెరుమాళ్‌దేవన్‌పట్టికి చెందిన కాళికుమార్ అనే లారీ డ్రైవర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు హత్య చేసి పారిపోయారు. కాళికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరుప్పుకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో కాళికుమార్ కుటుంబీకులు, బంధవులు ఆస్పత్రి ఎదుట మంగళవారం ఉదయం రాస్తారోకోకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న మహిళా డీఎస్పీ గాయత్రి సిబ్బందితో హుటాహుటిన అక్కడికి వెళ్ళి ఆందోళనకారులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. కొంతమంది డీఎస్పీ గాయత్రి జుట్టుపట్టుకుని లాగి, ఆమెపై దాడిచేశారు. వెంటనే కానిస్టేబుళ్లు ఆమెను దూరంగా తీసుకెళ్ళారు. ఈ విషయం తెలియగానే పోలీసులు కూడా రాస్తారోకోకు దిగారు. ఈ సమాచారం అందుకున్న ఎస్పీ కన్నన్ హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. మహిళా డీఎస్పీపై దాడి జరిపిన ఘటనలో నెల్లికుళం ప్రాంతానికి చెందిన బాలమురుగన్ (43) సహా నలుగురిని అరెస్టు చేశారు.

జాతీయ విద్యా విధానంపై డీఎంకే కపట నాటకం

● మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ ధ్వజం



చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న నూతన విద్యావిధానంపై రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం కపటనాటకమాడుతోందని అన్నాడీఎంకే నేత, మాజీమంత్రి ఆర్బీ ఉదయకుమార్ ధ్వజమెత్తారు. మదురైలో మంగళవారం ఉదయం పార్టీ శ్రేణులకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా రాజకీయ కక్షసాధింపు చర్యలు పాల్పడుతున్నాయని విమర్శించారు. అందరికీ విద్య పథకం కింద బాల్వాడీ నుంచి మహోన్నత పాఠశాలల వరకు నాణ్యమైన విద్య, ఉపాధ్యాయులకు వేతనం వంటి అవసరాలను కేంద్ర ప్రభుత్వం విద్యా నిధులను నిలిపివేయడం గర్హనీయమని ఉదయకుమార్ పేర్కొన్నారు. మొదటి విడతగా రూ.573 కోట్లను జూన్‌లోనే విడుదల చేయాల్సి ఉండగా, సెప్టెంబర్ వచ్చినా విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం మొండివైఖరిని ప్రదర్శిస్తోందని ఆరోపించారు. నూతన విద్యావిధానంలో రాష్ట్రాన్ని చేర్చేదిశగా 2022లో ప్రారంభించిన ఈ విద్యావిధానంలో చేరిన తర్వాతే నిధుల కేటాయింపులు జరుగుతాయన్న షరతుపై ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వం సంతకాలు చేసిందని కేంద్ర విద్యాశాఖ మంత్రి చెబుతుండగా, ఆ విద్యావిధానంలో చేరే ప్రసక్తే లేదంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో డీఎంకే ప్రభుత్వం కపటనాటకమాడుతోందని స్పష్టంగా రుజువవుతోందని ఉదయకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మహేంద్రన్, తవసి, తమిళరసన్, పార్టీ ప్రముఖులు ధనరాజన్, వెట్రివేల్, డాక్టర్ విజయపాండ్యన్, భూమారాజా, అరియూరు రాధాకృష్ణన్, శివశక్తి తదితరులు పాల్గొన్నారు.

ఫార్ములా-4 రేస్ మార్గంలో యథావిధిగా వాహనాల రాకపోకలు

పెరంబూర్, సెప్టెంబరు 3: నగరంలో ఫార్ములా-4 రేస్ నిర్వహించిన మార్గాల్లో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగాయి. స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్ నుంచి వార్ మెమోరియల్, నేపియర్ వంతెన, స్వామి శివానంద రోడ్డు, అన్నాసాలై మీదుగా గత శని, ఆదివారాల్లో ఫార్ములా-4 కార్ రేస్ పోటీలు జరిగిన విషయం తెలిసిందే, ఈ రేస్ జరిగే మార్గానికి ఇరువైపుల మెస్‌లు, రేకులను ఏర్పాటుచేశారు. రేస్ జరిగే మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేసి, ఆ మార్గాన్ని వన్‌వేగా ప్రకటించారు. రేస్ ముగియనడంతో వలలు, రేకులు తొలగించడంతో మంగళవారం నుంచి రాకపోకలు యథావిధిగా సాగాయి.

58వ సారి సెంథిల్ బాలాజీ రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు 3: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 58వ సారి చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు పొడిగించింది. చట్టవిరుద్ధ నగదు బట్వాడా కేసులో గత ఏడాది జూన్‌లో అరెస్టయిన సెంథిల్ బాలాజీ పుళల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఆయన బెయిలు పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులు తోసిపుచ్చాయి. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజీకి విధించిన రిమాండ్ మంగళవారంతో ముగిసిన నేపథ్యంలో, జైలు నుంచే ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. దీంతో, ఆయన రిమాండ్‌ను 58వ సారి ఈ నెల 5వ తేది వరకు పొడిగిస్తూ న్యాయమూర్తి అల్లి ఉత్తర్వులు జారీచేశారు. కాగా, ఈ కేసులో సిటీ యూనియన్ బ్యాంక్ కరూర్ శాఖ మేనేజర్ హరీష్‌కుమార్‌ను సెంథిల్ బాలాజి తరఫున న్యాయవాది క్రాస్ ఎగ్జామిన్ చేశారు.

మత్తు ఇంజక్షన్లు వినియోగిస్తున్న ఇద్దరి అరెస్ట్

వేలూరు, సెప్టెంబరు 3: స్థానిక కాట్పాడి సమీపం తిరువళ్లువర్‌నగర్ పుదుపల్లికుప్పం రోడ్డులో కొందరు మత్తు ఇంజక్షన్లు వినియోగిస్తున్నట్లు కాట్పాడి డివిజన్ ఏఎస్పీకి పళనికి సమాచారం అందింది. ఆయన ఉత్తర్వులతో కాట్పాడి ఇన్‌స్పెక్టర్ ఆనందన్ నేతృత్వంలో పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. అక్కడ అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారు అనైకట్టు తాలూకా విరింజిపురం ప్రాంతానికి చెందిన లక్ష్మీకాంత్, వేలూరు కొసపేట లాన్‌సింగ్ వీధికి చెందిన భరత్ అని గుర్తించారు. వారి నుంచి సిరింజి, మత్తు ఇంజక్షన్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి వేలూరు జైలుకు తరలించారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు

వైద్యుడి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 3: తన తల్లి పనిచేసే పాఠశాల విద్యార్థినిలను లైంగికంగా వేధించిన కేసులో పీహెచ్‌సీ డాక్టర్‌ను తిరుచ్చి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ జిల్లాలోని ఓ గ్రామంలో ఉన్న పాఠశాల హెచ్‌ఎం కుమారుడు శాంసన్ లాల్‌కుడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఈయన తన డ్యూటీ తరువాత తల్లి కోసం పాఠశాలకు వెళ్ళేవాడు. ఈ క్రమంలో ఆ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినిలను లైంగికంగా వేధించసాగాడు. దీనిపై పలువురు విద్యార్థులు చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్ నంబరు 1098కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి ఫిర్యాదు మేరకు పాలక్కరై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో శాంసన్ వేధింపులకు పాల్పడినట్టు తేలడంతో అరెస్టు చేశారు.

ఖరీదైన సెల్‌ఫోన్ల చోరీ: ఇద్దరి అరెస్టు

అడయార్ సెప్టెంబరు 3: పార్శిళ్ళలో వచ్చే ఖరీదైన మొబైల్ ఫోన్లను తస్కరించే ఇద్దరు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక అరుంబాక్కంకు చెందిన నారాయణన్ (38) ఒక కొరియర్ సర్వీస్ కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్నారు. ఈయన తమ కంపెనీకి పార్శిళ్ళలో వచ్చే ఖరీదైన మొబైల్ ఫోన్లు మాయమవుతున్నాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఆ కంపెనీలో పనిచేసే దినేష్ , అజిత్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, పార్శిళ్ళలో వచ్చే ఫోన్లను చోరీ చేసి ఇటుక, రాళ్లు పెట్టి డెలివరీ చేస్తున్నట్టు వెల్లడించారు. ఆ విధంగా, 13 ఖరీదైన ఫోన్లను తస్కరించినట్టు తెలిపారు. దీంతో వారిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

సముద్ర తీరానికి రూ.2 కోట్ల డ్రగ్

అడయార్, సెప్టెంబరు 3: నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీపంలోని కొడియక్కరై వద్ద రూ.2 కోట్ల విలువ చేసే మాదకద్రవ్యాలు సముద్ర తీరానికి చేరాయి. దీనిపై వేదారణ్యం క్యూ బ్రాంచ్, నిఘా విభాగం పోలీసులు విచారణ జరుపుతున్నారు. అలాగే, తీరానికి చేరుకున్న డ్రగ్స్ స్వాధీనం చేసుకుని పరీక్షల నిమిత్తం చెన్నై పంపించారు. అలాగే, ఈ డ్రగ్స్ అంశంపై వేదారణ్యం పోలీసులు కేసు నమోదు విచారణ జరుపుతున్నారు. మాదకద్రవ్యాలు తీరానికి ఎలా వచ్చాయి, సముద్ర మార్గంలో అక్రమంగా తరలిస్తుంటే సముద్రంలో పడ్డాయా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

వడివేలు పరువునష్టం దావా

● సింగముత్తుకు 2 వారాల గడువు

అడయార్, సెప్టెంబరు 3: హాస్య నటుడు వడివేలు దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో మరో హాస్య నటుడు సింగముత్తు కౌంటర్ దాఖలు చేయడానికి మద్రాస్ హైకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. గతంలో ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హాస్య నటుడు వడివేలుపై సింగముత్తు సంచలన ఆరోపణలు చేశారు. దీంతో సింగముత్తుపై రూ.5 కోట్లకు వడివేలు పరువునష్టం దావా వేశారు. ఈ కేసు విచారణ మద్రాస్ హైకోర్టులో సాగుతుండగా, మంగళవారం మరోమారు విచారణకు వచ్చింది. ఆ సమయంలో సింగముత్తు తరఫున హాజరైన న్యాయవాది కౌంటర్ దాఖలు చేయడానికి సమయం కావాలని కోరడంతో రెండు వారాల సమయం ఇస్తూ కోర్టు ఆదేశించింది.

కోవైలో చెడిపోయిన 103 కిలోల చేపలు స్వాధీనం

పెరంబూర్, సెప్టెంబరు 3: కోయంబత్తూర్ ఉక్కడం లారీపేట చేపల మార్కెట్, సెల్వపురం బైపాస్ రోడ్డులోని ఉక్కడం చేపల మార్కెట్లలో ఆహార భద్రతా శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఆయా మార్కెట్లలోని 51 దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు, చెడిపోయిన 103.5 కిలోల చేపలు స్వాధీనం చేసుకుని, దుకాణ యజమానులకు జరిమానా విధించారు.

మోపెడ్ పెట్రోల్ ట్యాంక్‌లో పాము



పెరంబూర్, సెప్టెంబరు 3: కోయంబత్తూర్ సూలూరులో రోడ్డు పక్కన నిలిపిన మోపెడ్ సీటు కింది భాగంలో దాగిన రెండు తలల బురద పామును బంధించారు. దినేష్ అనే యువకుడు మోపెడ్ పెట్రోల్ ఎంత ఉంది అని చూసేందుకు సీటు తెరచిన సమయంలో దానిలోపల పాము ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందాడు. సమాచారం అందుకున్న పాములు పట్టే సజీస్ అక్కడకు చేరుకొని పామును బంధించి సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

జాలరి వలలో మొసలి కళేబరం



పెరంబూర్, సెప్టెంబరు 3: కడలూరు జిల్లా శ్రీముష్ణం సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు విసిరిన వలలో 100 కిలోల బరువున్న మృతి చెందిన మొసలి కళేబరం చిక్కింది. ఈ మొసలి కళేబరం చూసి దిగ్భ్రాంతి చెందిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అదే సమయంలో చెరువులో మరికొన్ని మొసళ్లుండే అవకాశముందని, ఏదైనా ప్రమాదం జరుగకముందే అధికారులు చెరువులో గాలించి మొసళ్లు బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా, ప్రతిరోజు ఈ చెరువులో గ్రామస్తులు స్నానాలు చేస్తుంటారు. అలాంటి చెరువులో మొసలి లభించడం కలకలం రేపింది. మొసలి కళేబరాన్ని ఎవరైనా చెరువులో విసిరేసి వెళ్లారా, మరేదైనా కారణమా అంటూ అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

విమానంలో ధూమపానం

● యువకుడిని హెచ్చరించిన పోలీసులు

పెరంబూర్, సెప్టెంబరు 3: ఆకాశంలో ఎగురుతున్న విమానంలో ధూమపానం చేసిన యువకుడిని పోలీసులు హెచ్చరించారు. కువైట్ నుంచి 178 మంది ప్రయాణికులతో ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం మంగళవారం ఉదయం చెన్నై బయల్దేరింది. ఆకాశంలో విమానం ఉన్న సమయంలో తిరువారూరు జిల్లాకు చెందిన ఫరూఖ్ తరచూ బాత్రూంకు వెళ్లి ధూమపానం చేయడాన్ని తోటి ప్రయాణికులు గమనించి పైలెట్‌కు చెప్పడంతో ఆయన చెన్నై విమానాశ్రయ కంట్రోల్ రూమ్‌కు తెలియజేశారు. విమానం చెన్నైలో ల్యాండ్ అయిన వెంటనే కస్టమ్స్ అధికారులు, ఇమ్మిగ్రేషన్ అధికారులు ఫరూఖ్ అదుపులోకి తీసుకొని విచారించి విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. తనకు విమానంలో ధూమపానం చేయరాదన్న విషయం తెలియదని, తనను క్షమించాలని ఫరూఖ్ కోరడంతో, అతని నుంచి క్షమాపణ పత్రం తీసుకున్న పోలీసులు, హెచ్చరించి పంపించారు.

చిత్రజ్యోతి

గేయ రచయిత అస్మిన్‌కు వరుస అవకాశాలు


పొట్టువిల్ అస్మిన్

హీరో విజయ్ ఆంటోనీ నటించిన 'నాన్' చిత్రం ద్వారా తమిళ చిత్రపరిశ్రమకు పరిచయమైన శ్రీలంక గేయ రచయిత పొట్టువిల్ అస్మిన్ ఇపుడు కోలీవుడ్‌లో వరుస అవకాశాలు చేజిక్కించుకుంటూ బిజీ అయిపోయారు. ఆయన రచించిన 'అయ్యోసామి నీ ఎనక్కు వేణామ్' అనే ఆల్బమ్ పాటకు విశేష ఆదరణ లభించింది. ఈ పాటను యూట్యూబ్‌లో ఆరు కోట్ల మంది వీక్షించారు. తమిళంలో 'పీపుల్స్ అవార్డు' గెలుచుకున్న తొలి తమిళ పాటగా నిలిచింది. ఆ తర్వాత సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కొచ్చడియాన్', 'అన్నాత్త', అజిత్ కుమార్ 'విశ్వాసం' వంటి చిత్రాల ప్రోమో పాటలతో ప్రేక్షకుల మనసులను గెలుచుకున్నాడు. ప్రస్తుతం చేతిలో 'తిరుంబిపార్, 'బైలా', 'యుఆర్ నెక్స్ట్', 'ది స్టూడియో', 'బైనాక్యులర్', 'నాలైయ మాట్రమ్', 'గామా' వంటి చిత్రాలతో పాటు పేర్లు ఖరారు చేయని అనేక సినిమా ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సినిమాలకు అద్భుతమైన పాటలను అందించే పనిలో నిమగ్నమైవున్నారు. తమిళ చిత్రపరిశ్రమలో కవి పేరరసుగా పేరొందిన వైరముత్తు ప్రశంసలు కూడా అందుకున్నారు. వైరముత్తు కలైంజర్ శతాబ్ది వేడుకలను పురస్కరించుకుని 'కవితలు 100' పేరుతో రూపొందించిన కవితా సంకలనంలో అస్మిన్ రాసిన కవితకు స్థానం దక్కడం విశేషం. శ్రీలంకకు చెందిన పొట్టువిల్ అస్మిన్‌కు తమిళ భాషపై మంచి పరిజ్ఞానంతో పాటు ఆసక్తి ఉండటంతో దేశ సరిహద్దులకు ఆవల కూడా అద్భుతంగా రాణిస్తున్నారు.

సంతోష్ సరసన శ్రద్ధా శ్రీనాథ్



నటుడు సంతోష్ ప్రతాప్ నటించే వెబ్ సిరీస్‌లో హీరోయిన్‌గా శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తున్నారు. 'తూంగావనం', 'కడరామ్ కొండన్' వంటి చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు రాజేష్ ఎం.సెల్వ ఈ వెబ్ సిరీస్ రూపొందిస్తున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్, ఎస్కేప్ ఆర్టిస్ట్ అనే నిర్మాణ సంస్థలు కలిసి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాయి. ఇందులో సంతోష్ ప్రతాప్ సరసన శ్రద్ధా శ్రీనాథ్‌ను ఎంపిక చేశారు. దర్శకుడు రాజేష్ ఎం సెల్వ గతంలో తెరకెక్కించిన చిత్రాలకు విశేష ఆదరణ లభించడంతో ఈ వెబ్‌సిరీస్‌పై అంచనాలు నెలకొన్నాయి.

రంగస్థలం వృద్ధి చెందుతూనే ఉంటుంది

● సముద్రఖని

సినిమా ఎంత గొప్పస్థాయికి చేరుకుందో, అలాగే రంగస్థలం కూడా నానాటికీ వృద్ధి చెందుతూనే ఉందని ప్రముఖ దర్శక నటుడు సముద్రఖని అన్నారు. విజయ్ హీరోగా నటించిన 'నన్బన్' చిత్రంలో నటుడు జీవా సోదరిగా నటించిన దేవి 'దేవిరిక్షా' అనే నాటక శిక్షణ స్కూల్ స్థాపించి, అనేక మంది రంగస్థల కళాకారులను తయారుచేస్తున్నారు. ఈ పాఠశాల 15వ వార్షికోత్సవ వేడుకలు నగరంలో రెండు రోజుల పాటు జరిగాయి. ఈ సందర్భంగా నాటకాలు, డప్పు వాయిద్యం, కథలు చెప్పడంతో పాటు అనేక రకాల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ముగింపు వేడుకల్లో దర్శకులు చేరన్, సముద్రఖని, నటుడు సౌందరరాజా, తమిళనాడు పార్క్య ప్రణాళికా సంఘం అధ్యక్షుడు దిండిగల్ ఐలియోనీ తదితరులు పాల్గొన్నారు. ఇందులో సముద్రఖని మాట్లాడుతూ, రంగస్థలం వృద్ధి చెందుతుంది.. వృద్ధి చెందుతూనే ఉంటుందన్నారు. దర్శకుడు చేరన్ మాట్లాడుతూ, 'సాయంత్రం వేళ ఒక నాటకాన్ని వీక్షించి చాలా రోజులైంది. ఈ పాఠశాలకు చెందిన కళాకారులతో విభిన్నమైన అనుభూతిని పొందాను. సమకాలీన విషయాలపై పూర్తి స్థాయిలో వ్యంగ్యాత్మకంగా నటకాన్ని ప్రదర్శించడం అద్భుతంగా ఉందన్నారు. దిండిగల్ ఐ లియోనీ మాట్లాడుతూ, 'నటనలో శిక్షణ ఇచ్చే కాలేజీలు అనేకం ఉన్నాయి. కానీ నాటకాల్లో శిక్షణ ఇచ్చే పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇవి ఎల్లపుడూ ప్రేక్షకుల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతాయి. చాలా కాలం తర్వాత 'భారతి కన్నమ్మ' వంటి అద్భుతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు చేరన్ వంటి మిత్రులతో వేదిక పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఎంతో ఉన్నత స్థాయికి చేరన్ చేరుకున్నప్పటికీ... ఆయన మాత్రం చాలా సింపుల్‌గా ఉంటారు. అది నాకు ఎంతో నచ్చింది. చేరన్ అంటే ప్రత్యేక అభిమానం' అని పేర్కొన్నారు. అలాగే, ఇతర అతిథులు కూడా పాల్గొని ప్రసంగించారు.


రంగస్థల కళాకారులతో చేరన్, లియోనీ, సముద్రఖని తదితరులు


'తాయమ్మ' సీరియల్ బృందం

మౌనాన్ని తప్పుగా అర్థం చేసుకుంటారు

● రాధిక

జస్టిస్ హేమ కమిషన్ నివేదికపై చిత్రపరిశ్రమకు చెందిన అగ్రనటీనటులు మౌనం వహించడాన్ని సీనియర్ నటి రాధిక శరత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకుంటారని, అందువల్ల ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ అభిప్రాయాలను బహిర్గతం చేయాలని ఆమె కోరారు. తాను ప్రధాన పాత్రలో నటించిన 'తాయమ్మ' టీవీ సీరియల్ దూరదర్శన్ చానెల్‌లో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దీనిని పురస్కరిచుకుని ఆ సీరియల్‌లో నటించిన నటీనటులతో పాటు దర్శక నిర్మాతలంతా కలిసి నగరంలో సోమవారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ, చిత్రపరిశ్రమలో నటీమణులపై జరుగుతున్న లైంగిక వేధింపులపై పలువురు సీనియర్ హీరోలు నో కామెంట్స్ అంటూ మౌనం వహించడం సరికాదు. వారి మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడమే కాకుండా అంగీకారంతో సమానంగా భావించే పరిస్థితి వస్తుంది. చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉన్న మాట నిజమే. నా కళ్ళ ఎదుటే పలు సంఘటనలు జరిగాయి. వాటిని నేను అక్కడే ఎదిరించారు. బాధితులకు అండగా నిలబడ్డాను. ప్రముఖ హీరోను పెళ్ళి చేసుకున్న ఓ హీరోయిన్‌కు సైతం ఈ తరహా వేధింపులు జరిగాయి. ఆ సమయంలో ఆమెకు నేను అండగా ఉన్నాను. తమ సంస్థ రాడాన్ మీడియా వర్క్స్‌లో పనిచేసే ప్రతి నటి బాధ్యత మేమే తీసుకుంటాం. అలాగే, సినిమాలో నటించే హీరోయిన్‌తో పాటు జూనియర్ ఆర్టిస్టులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆయా చిత్ర నిర్మాత లు, ప్రొడక్షన్ యూనిట్‌దే. ఒక సంఘటన జరిగితే బాధితురాలికి న్యాయం జరిగేందుకు కొన్నేళ్ళ పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి. ఉదాహరణకు నిర్భయ కేసే తీసుకోండి. ఈ కేసు పూర్తయ్యేందుకు ఎనిమిదేళ్లు పట్టింది. ప్రస్తుతం కోలీవుడ్‌లో అగ్రస్థానంలో ఉన్న నటీనటులు చాలా మంది రాజకీయాల్లో ఉన్నారు. సమాజం కోసం ఆందోళనలు చేసే ముందు సోదర భావంతో తోటి నటీమణుల బాధను అర్థం చేసుకుని వాళ్ళకు మద్దతు తెలియజేయండి' అని విజ్ఞప్తి చేశారు.

విజయ్ బ్యానర్లు, కటౌట్లపై నిషేధం?



చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండిలో నిర్వహించనున్న తమిళగ వెట్టి కళగం (టీవీకే) మహానాడుకు పోలీసుల అనుమతి జాప్యం అవుతుండటంతో నటుడు విజయ్ అభిమానులు నిరాశ చెందుతున్నారు. తాజాగా విజయ్ హీరోగా నటించిన 'దిగోట్' చిత్రం బ్యానర్లు సినిమా థియేటర్ల వద్ద కనిపించకపోవడంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 'ది గోట్' సినిమా విడుదలవుతున్న విషయం తెలిసిందే. విజయ్ సినిమాల రిలీజ్ కావటానికి వారం రోజుల ముందే రాష్ట్ర వ్యాప్తంగా సినిమా థియేటర్ల వద్ద పెద్దపెద్ద బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటుచేసి అభిమానులు సందడి చేస్తుంటారు. ప్రస్తుతం విజయ్ సినిమా విడుదలకు రెండు రోజులే ఉండగా థియేటర్లలో ఆ సినిమా బ్యానర్లు, కటౌట్లు లేకపోవడం పట్ల అభిమానులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రాజకీయ పార్టీ నాయకుడిగా ఉన్న విజయ్ సినిమా బ్యానర్లు, కటౌట్లు కడితే శాంతి భద్రతల సమస్యలు ఏర్పడతాయనే కారణంగా పోలీసులు బ్యానర్లు, కటౌట్ల ఏర్పాటుపై నిషేధం విధించారని చెబుతున్నారు. ఇక 'ది గోట్' సినిమా విడుదలయ్యే నగరంలోని థియేటర్ల వద్ద బ్యానర్లు, కటౌట్లు కట్టేందుకు అనుమతించాలని కోరుతూ గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియకు రాష్ట్ర సినీ వీక్షకుల సంఘం వినతిపత్రం పంపింది.

న్యాయనిపుణులతో విజయ్ చర్చలు.. : విక్రవాండిలో పార్టీ మహానాడు నిర్వహణకు అనుమతించే విషయమై పోలీసులు పంపిన నోటీసులోని 21 ప్రశ్నలకు సమాధానాలిచ్చే దిశగా తమిళగ వెట్రి కళగం (టీవీకే) నాయకుడు, సినీ నటుడు విజయ్ న్యాయనిపుణులతో చర్చలు జరుపుతున్నారు. రెండు రోజులుగా ఆయన మహానాడుకు పోలీసుల అనుమతి త్వరగా లభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితర నాయకులతో చర్చించారు.

చర్మ సంరక్షణపై అవగాహన అవసరం

● ఎస్ఆర్ఎం జాతీయ సదస్సులో వక్తలు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చర్మ సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే దిశగా ఫార్మసీ రంగం చర్యలు చేపట్టాలని జాతీయ సదస్సులో వక్తలు పేర్కొన్నారు. కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం టీటీ గణేశన్ ఆడిటోరియంలో జరిగిన జాతీయ సదస్సులో వక్తలు మాట్లాడుతూ సౌందర్యం కోసం ఉపయోగించే నాణ్యమైన సౌందర్య సాధనాల తయారీపై దృష్టి సారించాలని సూచించారు. ఎస్ఆర్ఎం శాస్త్ర సాంకేతిక సంస్థ (ఎస్సారెమ్ఐఎస్టీ), ఎస్ఆర్ఎం ఫార్మసీ కళాశాల, ఐడీఎంఏ అండ్ ఐపీఏ (తమిళనాడు శాఖ) సంయుక్త ఆధ్వర్యంలో సౌందర్య పోషకాలు - సౌందర్య సాధనాలు అనే అంశంపై రెండు రోజులు సదస్సు నిర్వహించారు. ఐడీఎంఏ చైర్మన్ జే జయశీలన్, ఎస్ఆర్ఎం ఫార్మసీ కళాశాల డీన్ డాక్టర్ వి.చిత్ర, ఎస్ఆర్ఎం వైద్యకళాశాల ప్రోవైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎ.రవికుమార్, సుమారు 300 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు.



సదస్సు సావనీర్ ఆవిష్కరిస్తున్న ఐడీఎంకే చైర్మన్ జే జయశీలన్, ఎస్ఆర్ఎం ఫార్మసీ కళాశాల డీన్ డాక్టర్ వి. చిత్రతదితరులు

మేల్‌మలయనూరులో ఆవణి అమావాస్య వేడుకలు


ఆవణి అమావాస్య వేడుకల్లో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్)లో గణేశ్ సమేత అంకాళపరమేశ్వరి

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరులోని సుప్రసిద్ధ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి ఆవణి అమావాస్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఊంజల్ ఉత్సవాన్ని నిర్వహించారు. లక్షలాదిమంది భక్తులు దీపాలు పట్టుకుని అమ్మవారిని దర్శించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని సోమవారం వేకువజామున మూలస్థానంలో కొలువై ఉన్న అమ్మవారికి, పరమేశ్వరుడికి పంచామృతం, చందనం, పసుపు, కుంకుమ, విభూది తదితర ద్రవ్యాలతో అభిషేకాలు చేసి స్వర్ణకవచాలంకరణ చేశారు. ఆ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు మహాదీపారాధన జరిపారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని వడిలో వినాయకుడు ఉన్నట్టు గణేశజనని అలంకారం చేశారు. రాత్రి 10.30 గంటలకు అంకాళపరమేశ్వరి అమ్మవారిని ఊంజల్ మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లి ఊయలపై గణేశ సమేత అంకాళపరమేశ్వరి అమ్మవారిని ఉంచారు. ఆ తర్వాత ఆలయ పూజారి ఊయలనుఊపటంతో ఊంజల్ మండపం ఎదురుగా పందిరి దిగువన పిండి దీపాలు, నేతి దీపాలు, దీపాలను పట్టుకున్న లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి 'అంకాళమ్మా.. అంకాళమ్మా' అంటూ భక్తి పారవశ్యంతో నినాదాలు చేశారు. ఆలయ పూజారులు అంకాళపరమేశ్వరి అమ్మవారిని కీర్తిస్తూ జోలపాట గానం చేశారు. ఊంజల్ ఉత్సవం ముగియగానే అమ్మవారికి దీపారాధన నిర్వహించారు. రాత్రి 11.30 గంటలకు అమ్మవారిని ఆలయ మండపానికి తరలించారు. ఈ వేడుకల్లో విల్లుపురం, కడలూరు, సేలం, వేలూరు, తిరువణ్ణామలై, కాంచీపురం, చెన్నై తదితర జిల్లాల నుండి, పుదుచ్చేరి, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించారు.

రంపపు పొట్టుతో వినాయక ప్రతిమలు


రంపపు పొట్టుతో సిద్ధమైన వినాయకుని ప్రతిమ


విగ్రహాల తయారీలో శ్రీనివాసరావు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొయ్య ప్రతిమలు రూపొందించడంలో సిద్ధహస్తుడైన ప్రముఖ దారుశిల్పి శ్రీనివాసరావు వినాయక చవితిని పురస్కరించుకుని రంపపు పొట్టుతో వినాయక ప్రతిమలు రూపొందిస్తున్నారు. స్థానిక మొగిలివాక్కంకు చెందిన ఆయన రంపపు పొట్టు ప్రతిమల గురించి మాట్లాడుతూ.. ఐదు వైద్య గుణాలు కలిగిన చెట్ల కొయ్యతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో చందనం, ఎర్రచందనం, కరుంగాలి, అత్తి, వేప రకాలున్నాయన్నారు. ఇవి వాస్తు, దిష్టి దోషాలను తొలగిస్తాయని, ఇంట్లో ప్రతికూల శక్తులను పారదోలే శక్తి కూడా వుందని పలువురి ప్రగాఢ విశ్వాసమన్నారు. ఎన్ని సంవత్సరాలైనా రంగు, సువాసన మారని విశిష్టత కలిగివుంటాయన్నారు. ఎర్రచందనంతో కొన్ని మందులు తయారు చేస్తారని, చందనం చర్మ సంరక్షణకు ఉపయోకరమన్నారు. అత్తి గర్భధారణకు ఔషధంలా పని చేస్తుందని, కరుంగాలి ప్రతికూల శక్తిని తొలగించి అనుకూల శక్తి ప్రసాదిస్తుందన్నారు. వేప రోగ నిరోధక శక్తిని అందిస్తుందన్నారు. ప్రజల నుంచి ఈ ప్రతిమలకు విశేషమైన స్పందన లభిస్తోందని వివరించారు.

చెన్నై తిరువొత్తియూర్‌లో ఉన్న వెల్లయన్ చెట్టియార్ మహోన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో లబ్దిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ (చిత్రంలో) మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, పీకే శేఖర్‌బాబు, ఎంపీ కళానిధి వీరాస్వామి, ఎమ్మెల్యే ఎళిలన్, సుదర్శనం తదితరులు




చెన్నై రిప్పన్‌భవనంలో కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీమేయర్ మహేష్‌కుమార్‌తో సమావేశమైన కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

బస్సులో టిక్కెట్టు కొని ప్రయాణించిన మంత్రి


కండక్టర్ నుంచి టిక్కెట్టు కొనుగోలు చేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, సెప్టెంబరు 3: తిరుచ్చి విమానాశ్రయాన్ని మంగళవారం మంత్రులు అన్బిల్ మహేష్, సుబ్రమణ్యం పరిశీలించారు. ముందుగా టీవీఎస్ టోల్‌గేట్ నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు మంత్రి అన్బిల్ మహేష్ ప్రభుత్వ బస్సులో ప్రయాణించారు. తనతో పాటు బస్సు ఎక్కిన 10 మంది కార్యకర్తలతో పాటు తనకు కూడా మంత్రి టిక్కెట్లు కొనుగోలు చేశారు. అనంతరం విమానాశ్రయంలో మంత్రి ఎం.సుబ్రమణ్యం, జిల్లా కలెక్టర్ ప్రదీప్ ఎకుమార్‌తో కలసి మంత్రి అన్బిల్ మహేష్ విమానాశ్రయంలో చేపట్టిన ఎంపాక్స్ నియంత్రణ చర్యలు పరిశీలించారు.

డీఎంకేలో అసంతృప్తిని మేమే తొలగించుకుంటాం

● మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, సెప్టెంబరు 3: డీఎంకేలో ఉన్న అసంతృప్తి సమస్య అన్నదమ్ముల వంటిదని, దీనిని తామే తొలగించుకుంటామని నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ పేర్కొన్నారు. తిరుచ్చి విమానాశ్రయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ఆరోగ్యశాఖ, నగరపాలక శాఖలు సంయుక్తంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా డెంగ్యూ నివారణ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా తదితర జ్వరాలు వ్యాపించకుండా అన్ని శాఖలతో కలిసి సమష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్లు, అధికారులకు ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. సహజంగా అన్ని రాజకీయ పార్టీల్లో పదవులు ఇవ్వలేదని కొంతమంది సీనియర్ కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని, ఆ విధంగానే డీఎంకేలో కూడా నెలకొన్న సమస్య అన్నదమ్ముల మధ్య ఏర్పడే సమస్యలాంటిదేనని, దీనిని పార్టీ అధిష్ఠానం చర్చించి ఖచ్చితంగా తొలగిస్తుందన్నారు. ప్రతిపక్ష అన్నాడీఎంకేలో ఎవ్వరూ పార్టీని నడిపిస్తున్నారన్న స్పష్టత లేదన్నారు. కొత్తగా రాజకీయ పార్టీలు ప్రారంభించే వారి వల్ల తమకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్, పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ తదితరులు అధికార పార్టీని విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి అన్నారు. మంత్రి కేఎన్ నెహ్రూతో పాటు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌గా ఎస్డీఏటీ జట్టు



ఓవరాల్ ఛాంపియన్ టైటిల్ గెల్చుకున్న ఎస్డీఏటీ జట్టు

ప్యారీస్, సెప్టెంబరు 3: తమిళనాడు జిమ్నాస్టిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ జట్టు ఓవరాల్ ఛాంపియన్ టైటిల్ సొంతం చేసుకుంది. వేళచ్చేరిలో 16వ రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా, మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి. ఇందులో ఎస్డీఏటీ చెన్నై జట్టు మొత్తం 20 స్వర్ణాలు, 10 రజతాలు, 7 కాంస్య పతకాలతో టైటిల్ సొంతం చేసుకుంది. ధర్మపురి జిల్లా జట్టు ద్వితీయ, తంజావూరు జట్టు తృతీయస్థానంలో నిలిచాయి. సోమవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎస్డీఏటీ చైర్మెన్ మేఘనాథన్, వీరపాండ్య కట్టబమ్మన్, పీపుల్స్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు ఇలయ కట్టబమ్మన్, సుకుమారన్, జీవా తదితరులు పాల్గొన్నారు.

బాలిక కడుపులో 1.5 కేజీల వెంట్రుకలు

● విజయవంతంగా తొలగించిన వైద్యులు


వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు


పుదుచ్చేరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరికి చెందిన 17 యేళ్ళ బాలిక కడుపులో ఉన్న 1.5 కేజీల హెయిర్‌బాల్‌ను జెమ్ ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ ద్వారా తొలగించారు. ప్రస్తుతం ఆ బాలిక ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. ఇదే విషయంపై జెమ్ హస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ విభాగం డాక్టర్ కె.శశికుమార్ మీడియాతో మాట్లాడుతూ, కడుపులో చేరే వెంట్రుకలు రోగి జీర్ణ వ్యవస్థతో పాటు ఆరోగ్యాన్ని సైతం క్షీణింపజేస్తుందన్నారు. తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వచ్చిన ఆ బాలికకు వివిధ రకాల పరీక్షలు చేసి కడుపులో వెంట్రుకల గడ్డ ఉన్నట్టు గుర్తించామన్నారు. దీన్ని తమ ఆస్పత్రికి చెందిన వైద్యుల బృందం క్లిష్టమైన ఆపరేషన్ ద్వారా విజయవంతంగా తొలగించినట్టు తెలిపారు.

తిరుమలేశుడి సేవలో ఈపీఎస్


పళనిస్వామి

తిరుమల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి దర్శించుకున్నారు.వేకువజామున ఆలయంలో జరిగిన తోమాల సేవలో పాల్గొన్న ఈపీఎస్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

దివంగత ఆర్మీ చీఫ్ కుటుంబానికి 48 గంటల్లో పెన్షన్ ఆర్డర్


పెన్షన్ ఆర్డర్ అందజేస్తున్న అధికారులు

పెరంబూర్, సెప్టెంబరు 3: దివంగత ఆర్మీ చీఫ్ కుటుంబానికి 48 గంటల్లో కుటుంబ పెన్షన్ ఆర్డర్లు అందజేశారు. దేశవ్యాప్తంగా త్రిదళాలు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) కుటుంబ పెన్షన్లు నిర్వహించే బాధ్యత అలహాబాద్‌లోని ప్రిన్సిపల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ కార్యాలయం నుండి చెన్నైలోని డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్ కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో, నగరంలోని సెక్యూరిటీ అకౌంట్స్ కంట్రోల్ కార్యాలయం ప్రస్తుతం కుటుంబ పెన్షన్ ఆర్డర్ల జారీ, ఆధార్ వివరాల సేకరణ వంటివి చేపట్టింది. ఈ నేపథ్యంలో, ఇటీవల మృతిచెందిన మాజీ సైనిక దళాధిపతి జనరల్ పద్మనాభన్ మరణ ధృవీకరణ పత్రాలు అందిన 48 గంటల్లో చెన్నై డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్ కార్యాలయం కుటుంబ పింఛన్ ఆర్డరు జారీ చేసింది. చెన్నై అధికారి టి.జయశీలన్ కుటుంబ పింఛన్ ఆర్డర్‌ను దివంగత జనరల్ పద్మనాభన్ సతీమణికి మంగళవారం అందజేశారు.

ముగిసిన అస్మిత్ ఖేలో ఇండియా సైక్లింగ్ పోటీలు


విజేతలతో సైక్లింగ్ పోటీల నిర్వాహకులు

అడయార్, సెప్టెంబరు 3: తమిళనాడు సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో రెండు రోజుల పాటు జరిగిన సౌత్ రీజియన్ అస్మితా ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో మహిళా ఎలైట్ 36 కిమీ, 18 యేళ్ళలోపు బాలికల జూనియర్ 30 కిమీ, 16 యేళ్ళలోపు సబ్ జూనియర్, బాలికలకు 18 కిమీ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలకు చెందిన సైక్లింగ్ క్రీడాకారిణులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన తొలి ముగ్గురికి బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సుధాకర్, కార్యదర్శి విఘ్నేష్ కుమార్, కోశాధికారి పళనితో పాటు స్పోర్ట్స్ మిషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ శ్వేతా విశ్వనాథ్, ఎస్‌డీఏటీ మాజీ జనరల్ మేనేజర్ రెజీనా, తిరుపూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ శరవణ్‌లు పాల్గొన్నారు.